మీసాల రామకృష్ణ హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర - హిరమండలం : మాజీ సీఎం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరుఅనే కార్యక్రమానికి టెక్కలి వెళ్తున్న హిరమండలం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణని హిరమండలం పోలీస్ సిబ్బందితో ఏఎస్ఐ కొంత మంది పోలీస్ అధికారులు మంగళవారం ఉదయం ఆయన స్వగృహం లో హౌస్ అరెస్ట్ చేశారు. టెక్కలిలో రెవెన్యూ డివిజన్ లో నిరసన కార్యక్రమానికి వెళ్తే మీపై క్రిమినల్ చర్యలు తప్పవని పోలీస్‌లు హెచ్చరించినట్లు రామకృష్ణ మీడియా కు తెలియజేశారు. టెక్కలి లో నిర్వహించిన అన్నదాత పోరు ఎరువులు కొరత పై ఆర్‌డివో కార్యాలయంనకు వెళ్లేందుకు వీలు లేకుండా పోలీస్‌లు హౌస్ అరెస్ట్ చేశారు.

దసరా కానుకగా ఐఆర్ ప్రకటించండి

ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఎన్నికల ముందు ఉద్యోగులుకు అన్నీ సకాలంలో అమలు చేస్తామని మెరుగైన వేతన సవరణ అమలు చేస్తామని నమ్మ బలికి తీరా అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను విస్మరించడం కూటమి ప్రభుత్వానికి తగదని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళ వారం సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస మండలంలో కొర్లకోట, చీమలవలస, వెదుల్లవలస, కొత్తవలస, నిమ్మతొర్ల వాడ, తొగరాం, దూసి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదుళ్లవలస నందు ఉపాధ్యాయులతో జరి గిన సమావేశంలో మాట్లాడుతూ ఐదు కోట్ల ప్రజలు గురించి అనుక్షణం ఆలోచిస్తూ వారిని ముందుకు తీసుకువెళ్లాలని తపనతో రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాను అంటూ మా టలు చెప్పే ముఖ్య మంత్రికి ఐదు కోట్ల జనాభాలో ఉండే ఉ ద్యోగులు వారి కుటుంబాలు కనబడట్లేదా అని అనునిత్యం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాయడం తగదని విమర్శించారు. రోజురోజుకీ ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ఉద్యోగుల వేతనాలు నేల చూపులు చూస్తున్నాయని అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఉద్యోగుల వైపు కనీసం కన్నెత్తి చూడటంలేదని ఇది ఉద్యోగ వర్గాన్ని మోసం చేయడం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 11వ వేతన సవరణ గడువు పూర్తయి మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టినా కనీసం ఐఆర్ ప్రకటనలేదని 12వ వేతన సవరణ ఊసే లేదని ఇదే నా ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వం ఇదేనా అన్నారు. ఉద్యోగి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధం అవుతున్నాడని ఇప్ప టికైనా ప్రభుత్వం గ్రహించి ఉద్యోగులకు రావలసిన ప్రయో జనాలపై సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వానికి ఏ రకంగా ఉద్యోగులు గుణపాఠం చెప్పారో రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి అదే పరిస్థితి ఎదుర వుతుందని ప్రభుత్వానికి హితువు పలికారు. మూల్యాంకన పుస్తకాలపై పునరాలోచించి ఒకటి రెండు తరగతులకు బబ్లింగ్ లేకుండా చేయాలని మూల్యాంకన పుస్తకాల్లో మార్పు లు చేయాలని బోధనేతర పనులు పూర్తిగా లేకుండా చేసి విద్యార్థికి మెరుగైన బోధన అభ్యసనకు అనువైన వాతా వరణం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమా వేశంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు బి.రమేష్, కుమార్, ఎస్.రామచంద్ర ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియాపై గందరగోళం సృష్టిస్తున్నారు : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : బస్తాలు స్టాక్ పెట్టుకొని ఈ వేళ ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రైతు సోదరులందరికీ నేను ఒకటే విన్నవిస్తున్నా ప్రతి ఒక్క రైతుకి ప్రతి ఎకరాకు మొదటి విడతగా 25 కేజీలు, రెండో విడతగా 25 కేజీలు, మూడో విడతగా 25 కేజీ మొత్తం 75 కేజీలు అందజేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రతి ఎకరాకు భూమి ఉన్న లేదా భూమి సాగు చేస్తున్న కౌలు రైతుకు గాని ప్రతి ఒక్క ఎకరాకు మేము యూరియా ఇచ్చే పూర్తి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఏ రైతుకైనా మాకు ఈ తడవ, మొదటి విడత ఈ ఎకరాకు 25 కేజీలు అందలేదని నిస్సందేహంగా ఉన్న ఆర్బికేలు గాని, గ్రామ సచివాలయాలకు గాని వచ్చి వార్డు సచివాలయం వచ్చి మీరు అడగొచ్చన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చామని, ఆ నెంబర్‌ను మీరు సంప్రదించినట్లైతే తప్పకుండా మీకు యూరియాని అందిస్తామని చెప్పారు. సబ్సిడీ ద్వారా 70శాతం, గతంలో 50శాతం ఉండేదని 50శాతం మార్కెట్ కి ఇచ్చేవాళ్ళు మిగతాది మార్కెట్లో కొనుక్కునే వారన్నారు. ఈ సారి 70శాతం సబ్సిడీ ఇచ్చి 30శాతం మార్కెట్లకు ఇస్తామన్నారు. ఆ 30 శాతం కూడా కూడా రూ. 300 ఎక్కువగా అమ్మితే వారిపై కఠిన చర్యలు కూడా తీసు కుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా అడిగిన తక్షణమే కేంద్రం నుండి 50 వేల మెట్రిక్ టన్నులు తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం మొదటి విడతకి ఎన్ని ఎకరాలు వరి సాగు చేవారో ఆ ఎకరాకు పాతి కేజీలు చొప్పున మేము ఇప్పుడు యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, అప్పుడు ఈ వైసీపీ నాయకులు ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఈరోజు 24 గంటల్లో మేము డబ్బులు వేశామని ఇది నిజమా కాదా అని ప్రశ్నించారు. రైతు సోదరులకు కావాలని గందరగోళం సృష్టిస్తున్న వారి మాటలు నమ్మవద్దని కోరారు.

మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన యంత్ర. ఏ.ఐ, సీఈఓ

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, నిమ్మాడ తన తన క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని బ్రైట్ కోన్. ఏ.ఐ అమెరికన్ కంపెనీ, యంత్ర. ఏ.ఐ కంపెనీల సీ.ఈ.ఓ చింత తులసిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం, చిన్న రామకృష్ణాపురం. ఈయన జిల్లా కొట్టిన సందర్భంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తో కాసేపు మాట్లాడి జిల్లాలో యువతకు ఉపాధి కల్పించుటకు తమ వంతుగా కృషి చేస్తానని తెలియజేసారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించడం జిల్లా నుండి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పన దిశగా మీలాంటివారు దృష్టిసాదిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని, ఇక్కడ కొంత నిరుద్యోగ సమస్య తీరుతుందని సూచించారు. ప్రభుత్వం కూడా కొన్ని కంపెనీలను ఇక్కడికి ఆహ్వానించిందని, త్వరలోనే కంపెనీలు నెల కొల్పడం జరుగుతుందని, అందుకు మీలాంటి వారు మరికొంత తోడ్పాటునందిస్తే రాష్ట్రానికి, జిల్లాకి మేలు జరుగుతుందని అచ్చనాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు తనవంతు కృషి తాను చేస్తానని తులసిరావు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తులసీరావు పాటు, బెండి అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌కు ఎంపికలు

కుంటి భద్ర హైస్కూల్‌లో ప్రాథమిక పోటీలు

విశాలాంధ్ర - కొత్తూరు : జిల్లా స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలకు. కొత్తూరు మండలం నుండి ప్రాథమిక ఎంపికలు కోసం కుంటి భద్ర హై స్కూల్‌లో మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు మొత్తం 14 హై స్కూల్ ల్లా నుండి బాలూరు బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు రెండు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుంది అనీ కుంటి భద్ర హై స్కూల్ హెచ్చి ఏం బివి రమణ మీడియాకు తెలిపారు తొలి రోజు కార్యక్రమంలో డ్రిల్ మాస్టర్లు ఏంఇవో 1, 2లు పాల్గొన్నారు. కాగా ముఖ్య అతిధి గా పాల్గొన్న గ్రామ పెద్దలు టీడీపీ నేత ఆగత ముడి అరుణ కుమార్ ఈ ఆటల పోటీలు నిర్వహిన కు తన వంతుగా రూ.3000లు ఆర్థిక సహాయం హెచ్‌ఏంకు అందజెసారు.

శ్రీశయన ప్రతిభా పురస్కారాలకు ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గంతో పాటు వక్కనున్న మందస మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ సాధించిన శ్రీశయన సామాజికవర్గ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్యదీపిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఇందుకు గాను ఈ నెల 15వ తేదీ లోగా ధరఖాస్తులు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు కనీసం 500 మార్కులు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కనీసం 550 మార్కులు సాధించి ఉండాలని సూచించారు. అర్హత గల విద్యార్థులు మార్కుల జాబితా, కులధృవపత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ధరఖాస్తులను సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా సాగర్ వెజిటబుల్ షాపు నందు అందజేయాలని కోరారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు కరపత్రాలను విడుదల చేశారు.

పోలీసులు అక్రమ నిర్బంధనను ఖండించిన ఎచ్చెర్ల మాజీ శాసన సభ్యులు, సమన్వయకర్త గొర్లె కిరణ్ కుమార్

విశాలాంధ్ర - రణస్థలం : రైతులకు యూరియా, ఎరువులు అందించని కూటమి ప్రభుత్వ వైఫల్యం నేపథ్యంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల మాజీ శాసన సభ్యులు అండ్ సమన్వయ కర్త గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం రణస్థలం పార్టీ కార్యాలయం నుండి రణస్థలం తహసీల్దారు వారికి వినతిపత్రం అందించేదుకు వెళ్తున్న సందర్భంగా పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మీడియాతో మాట్లా డుతూ రైతుల కొరకు పోరాటం చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం నిరంకుశపాలనకు నిదర్శన మన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలో రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులకు యూరియా, ఎరువులు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. ఎరు వులను రైతు భరోసా కేంద్రాలు ద్వారా నేరుగా రైతులకు అందించకుండా బ్లాక్ మార్కెట్ ద్వారా అధిక ధరకు అమ్మకాలు జరుపుతున్నారన్నారు. అంతే కాకుండా వచ్చిన యూరియాను రైతులకు అందించ కుండా కూటమి నాయకులే పంచుకుంటున్నారని విమర్శించారు. దీనిని ప్రభు త్వం దృష్టిలో పెట్టు కొని సకాలంలో రైతులకు యూరియా, ఎరువులను అందించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ డిమాండ్ చేసారు. లేని తరుణంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు సత్యం నాయుడు బ్రహ్మాజీ సాయిరాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా ఎల్‌వీ రమణ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంత బొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు లఖినాన వెంకట రమణ, విద్యార్థులకు అందించిన విశేష సేవలు మరువలేనివని మండల పీఎసిఎస్ చైర్మన్ కూశెట్టి కాంతారావు, ఎంఈఓలు, జే.చిన్నవాడు, డీ.అర్జునుడు అన్నారు. పాఠశాలలో మంగళవారం ఘనంగా పౌర సన్మానం, పాఠశాలలో ఉపాధ్యాయ మిత్రులు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి పప్పు కృష్ణారావు, దాచెట్టి కృష్ణ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి మాస్టారు సేవలను గుర్తు చేశారు. మండలం ఉపాధ్యాయులు మిత్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు అందలేదు

విశాలాంధ్ర - హిరమండలం : సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు చాలా మంది లబ్ధిదారులకు నేటికీ అంద జేయలేదు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి మొక్క బడిగా అరకొరగా కొంత మందికి పంపిణీ చేసినప్పటికీ చాలా మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు సచివాలయసిబ్బంది అందజేయక పోవడం నిర్లక్ష్యం అని చెప్పక తప్పదు. సచివాలయ సిబ్బంది కి అడిగితే డీలర్ కొన్ని కార్డులు ఉంచేశారు. మా దగ్గర ఉన్నవి పంపిణీ చేస్తామని చెబుతున్నారు. పాత రేషన్ కార్డు నెంబరే కొత్త రేషన్ స్మార్ట్ కార్డు గా రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ఏది ఏమైనా రేషన్ కార్డు లబ్ధిదారులు మాత్రం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయక పోవడం తో ఆందోళన చెందుతున్నారు. సచివాలయం సిబ్బంది అందరూ కొత్త వాళ్లే.

ప్రతి రైతుకు యూరియా అందేలా ప్రభుత్వం కృషి చేయాలి

విశాలాంధ్ర - జలుమూరు : యూరియా కోసం ప్రస్తుతం రైతులు పడుతున్న బాధలను కూటమి ప్రభుత్వ అర్థం చేసు కోవాలని కాంగ్రెస్ పార్టీ నరస న్నపేట నియోజకవర్గం ఇన్చార్జ్ మామిడి సత్యనారాయణ అన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా గతంలో ఇచ్చేవారని ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు పంపిణీ బాధ్యతలు అప్పగించడంతో రైతుల నాన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఆలోచించి రైతుకు సకాలంలో సరిపడే యూరియాను అందజేయాలని మామిడి సత్యనారాయణ కోరారు.

విజయవంతమైన 'అన్నదాత పోరు'

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అన్నదాత పోరు విజయవంతమైంది. పోలాకి జడ్పిటిసి, డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు, రైతులు హాజరయ్యారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుండి మారుతి నగర్ జంక్షన్‌లో ఉన్న దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు ర్యాలీగా వెళు తున్న కృష్ణ చైతన్యను పోలీసులు అడ్డుకున్నారు. అయితే అధిక సంఖ్యలో ఉన్న రైతులు, వైసిపి కార్య కర్తలు వెంటరాగా, కృష్ణ చైతన్య, వైయస్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెళ్లి, తహసిల్దార్, టి. సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియాను అందించలేని ఈ కూటమి ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఎరువులను కూటమి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్కు తరలించి, రైతులను మోసం చేస్తుందని దుయ్య బట్టారు. రైతే రాజు అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో తీవ్రంగా విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, ఆరంగి మురళీధర్, మేజర్ పంచాయతీ సర్పంచ్, బురల్లి శంకర్రావు, వైసిపి కార్యకర్తలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు ఉద్యామాన్ని పోలీసుల చేత అడ్డు కోవడం తగదు

వైసీపీ నేత, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చింతాడ

విశాలాంధ్ర - కొత్తూరు : యూరియా సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న రైతంగం రైతులు ఎరువులు దొరక్క అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు పోరు కార్యక్రమంలో డివిజనల్ స్థాయిలో ధర్నాకు పిలుపునివ్వడంతో రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొనటకు ముందుకు వచ్చారు ఈ సమయములో రైతు ఉద్యమాన్ని అణగదొక్కే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం పోలీసులు పంపించి ఈ ఉద్యమాన్ని ఆపే ప్రయత్నం చేస్తుంది అనీ వైసీపీ నేత మాజీ పిఏసీ. ఎస్ చైర్మన్ చింతాడ సూర్య నారాయణ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా సంక్షోభం సృష్టించి ఈరోజు దేశంలో మనుగుడు కోల్పోయే పరిస్థితి వచ్చింది. మరి అదే విధంగా ఈరోజు కూటమి ప్రభుత్వం కూడా రైతుకు ఎరువులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు 260 రూపాయలు యూరియా బస్తా బ్లాక్ మార్కెట్లో 1100 ఇచ్చి కొనుగోలు చేసే పరిస్థితి వీటన్నిటికీ ప్రధాన కారణం ప్రభుత్వం వైఫల్యం కావున ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఉద్యమాల్ని అడ్డుకోవడం కాదు రైతుని ఆదుకోవడం మంచిది రైతే కన్నీరు పెడితే ఆ కన్నీరు ప్రభుత్వానికి తగిలి ప్రభుత్వాలు నాశనమైపోవడానికి కారణాలు అవుతాయి కాబట్టి రైతులో ఆనందం నింపే ప్రయత్నం చేయండి అంతేకానీ ఉద్యమాలు ఆపి రైతుని అణగదొక్కే ప్రయత్నం చేస్తే ఈ ఉద్యమం ఇంతటితో ఆగదు మరింత ఉధృతం చేసి ప్రజల్లోకి వెళ్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల నాయకులు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జిఆనందరావు . లబ్బ సర్పంచ్ ప్రతినిధి తులసి నేరడి ఓంద్రుజోల సర్పంచ్ ప్రతినిధి గంధవరపు నాగేంద్ర సర్పంచ్ ప్రతినిధి నక్క వెంకట్రావు బిట్2 సర్పంచ్ ధర్మారావు కుంటి భద్ర సర్పంచ్ రంజిత్. కారిగుడా సర్పంచ్ సింహాద్రి. నాగేశ్వరరావు. ఏ.రాఘవ ఎక్స్ ఎంపీటీసీ సభ్యులు చింతాడ నారాయణరావు లింగం. తదితరులు పాల్గొన్నారు.

10న విప్లవ పోరాట యోధులు కుమారన్న, సీతారాముల 27వ వర్ధంతి

విశాలాంధ్ర - పలాస : తలాస మండలం పెదగంతరు గ్రామంలో ఈ నెల 10న విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ కుమారన్న.. సీతారాముల 27వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నామని దీన్ని విజయ వంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఒక కొత్త దశలోకి ప్రయాణిస్తున్నదని. కార్పొరేట్ హిందూ దేశాన్ని స్థాపించాలనే కుట్రలో భాగంగానే విప్లవ చైతన్యాన్ని తుడిచేయాలనీ పీడిత అస్తిత్వ ప్రజలను విముక్తి దిశగా నడిపించే, కార్పొరేటీకరణను సమరశీలంగా ఎదుర్కొనే విప్లవోద్యమాన్ని పూర్తిగా దెబ్బతీయాలనీ బిజెపి ప్రభుత్వం చూస్తుందని అన్నారు. మధ్య భారత దేశంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసులను చంపేయాలనే దుర్మార్గపు కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ కగార్ 'అనే అంతిమ యుద్ధాన్ని పాలకులు నేడు నడుపుతున్నారని గత ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కగార్ పేరిట ఇప్పటికి వందలాది మందిని చంపేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో సాధారణ ఆదివాసులు, విప్లవకారులు ఉన్నారన్నారు. మధ్య భారత దేశంలో ఆదివాసుల హత్యాకాండ మరింత తీవ్రమైందనీ రాజ్యాంగ విలువలను, విధానాలను ఖాతరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల మీద యుద్ధానికి తెగబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్ధంతి సభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి : ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి : గ్రీవెన్స్‌లో ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులు, సమస్యలు వెంటనే పరిష్క రించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రామయ్య పుట్టుగలోని తన క్యాంపు కార్యలయంలో నియోజక వర్గంలోని ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాల్టీలోని రైతులు విద్యుత్ సమస్యలపై ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కారమయ్యాయి, మిగత వారికి వీలైనంత త్వరగా అంచనాలు వేసి రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా సమీక్షించారు. అలాగే నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకం నిధులతో ఎన్ని అభివృద్ధి పనులు జరిగాయి, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఎంతవరకు పూర్తి చేశారు. పంచాయతీ రాజ్ డీఈ, జేఈలు, ఎంపీడీవోలు, ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బంది ఉంటే అక్కడ ముందస్తుగా పనులు చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని,వాటిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీడీవో, తహసీల్దార్లు, ఉపాధి ఏపీడీ, ఏపీవో, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్త్రీశక్తితో సుసంపన్న సమాజం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సు ల్లో ప్రయాణించే మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు త్వరలో స్మార్ట్ కార్డులను అందజేయ నున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని స్త్రీశక్తి పథకం ప్రచారంలో భాగంగా నగరంలోని సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు మహిళలతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలన్నింటి కంటే 'స్త్రీశక్తి' పథకం వల్ల ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళల సహకారంతో స్త్రీశక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లాలోని మహిళల్లో చైతన్యం ఎక్కువ అని ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారని చెప్పారు. సీఎంగా ఉన్నప్పటి నుంచి చంద్రబాబునాయుడు మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించానని తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే.. ఇప్పుడు నారీశక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని అన్నారు. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు అందించామని, ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చామని చెప్పారు. బస్ పాసుల కోసం క్యూ లైన్లలో నిల్చొనే శ్రమ తప్పిందని, ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుందని అన్నారు. స్త్రీశక్తి శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవడం లేదని తెలిపారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని, అందుకనుగుణంగా సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు చెప్పారు. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తామని, ప్రజలకు, మహిళలకు మరింత మేలు చేకూర్చగలమని చెప్పారు. ఈ కార్యక్రమం లో మహిళా నాయకురాలు గొండు స్వాతి శంకర్, సుశీల, పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రియాంకకు నాలుగు బంగారు పతకాలు

విశాలాంధ్ర - పలాస : ప్రముఖ వైద్యులు, సామాజిక వేత్త డాక్టర్ జీవితేశ్వరరావు కుమార్తె డాక్టర్ ప్రియాంకకు అండర్ గ్రాడ్యుయేషన్(ఎంబీబీఎస్) సమయంలో ఆమె చదువుల్లో వివిధ విభాగాలలో ప్రతిభకు గాను మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్య క్రమంలో ఏపీ గవర్నర్ సయిద్ అబ్దుల్ నజీర్, మరియు ఏపీ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ చేతుల మీదుగా నాలుగు ఏపీ హెల్త్ యూనివర్సిటీ బంగారు పతకాలు అందుకున్నారు. చిన్నప్పటి నుండి చదువులో ముందుండే డాక్టర్ ప్రియాంక 10వ తరగతి కాశీబుగ్గ శ్రీ చైతన్య, ఇంటర్ విజయవాడ శ్రీ చైతన్య లో చదువుకున్నారు. అనంతరం మెడికల్ ఎంట్రెన్స్ లో మెరుగైన ప్రతిభ చూపించడంతో ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో మెడిసిన్ చదువుకున్నారు. అనంతరం యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్‌లో మూడు విడతల మొదటి, రెండవ దశ పూర్తి చేసి మూడవ దశ పరీక్షలకు హాజరు కావలసివుందని, ఈ దశ పూర్తి చేసిన తరువాత వచ్చే సంవత్సరం అమెరికాలో పీజీ కోర్సులో జాయిన్ అవుతారని డాక్టర్ ప్రియాంక తండ్రి డాక్టర్ జీవితేశ్వరరావు తెలిపారు.

నిరసన వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఏపీటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుభాష్ బాబు

విశాలాంధ్ర - మందస : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన వారం కార్యక్రమంను ఈ నెల 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్ బాబు పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఉపాధ్యాయులు సమస్యలైన పెండింగ్ డీఏలు విడుదల, పీఆర్‌సి కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన మరియు అన్ని మేనేజ్మెంట్ల సమస్యలు పరిష్కారానికై చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమం లో భాగంగా 11న నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరు, 12న మండల స్థాయి ప్రదర్శనలు, 13, 14 వ తేదీల్లో ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసనలు, 16న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 17న వాట్సాప్ మరియు ఈ మెయిల్ ద్వారా సీయస్ మరియు ముఖ్యమంత్రి లకు వినతులు పంపించే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దీనిలో భాగంగా ఏపీటీయఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో హరిపురం, అంబుగాం, లోహరిబంద, బహడపల్లి, బేతలాపురం, జిఆర్ పురం, కుంటికోట, పిడిమందస, వాసుదేవపురం మధ్య, దేవుపురం, మహాదేవపురం, కిల్లోయి, మందసలో పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు సమస్యలు సేకరిస్తూ, పై నిరసన కార్యక్రమం కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే సభ్యత్వ నమోదు కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీటియఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గవ్వ భీమారావు, మండల అధ్యక్షులు యస్ కిరణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కెపాపారావు,డి చంద్రశేఖర్, డి వైకుంఠరావు, కెజగదీశ్వర రావు, యస్ ఢిల్లేశ్వర రావు, కెచిరంజీవి, యస్ నారాయణరావు,డి దుర్గాప్రసాద్, యస్ కెహమీద్, టి గంగారావు,ఆర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు : లక్ష్మణరావు



విశాలాంధ్ర - రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గం చేతి వృత్తులు విభాగం అధ్యక్షులుగా టెకు లక్ష్మణరావును ఎంపిక చేసిన మాజీ శాసన సభ్యులు గొర్రెల కిరణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలని జేఆర్ పురం గ్రామానికి చెందిన టేక్ లక్ష్మణరావు (బ్రహ్మాజీ) తెలిపారు. మంగళవారం వైసీపీ పార్టీ కార్యాలయంలోఎచ్చెర్ల నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు గొర్ల కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీకి మాజీ శాసనసభ్యులు కిరణ్ కుమార్ దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్ని వృత్తిదారులు కలుపుకొని పార్టీ అభివృద్ధికి కిరణ్ కుమార్ గెలుపుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. నాకు సహకరించినటు వంటి వైసీపీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆపదలో ఉన్న వారికి సంజీవని 108 సేవలు

విశాలాంధ్ర - పలాస : ఆపదలో ఉన్న వారికి సంజీవనిల ఆదుకునేందుకు 108 అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగ పడు తున్నదని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. మంగళవారం కాశీబుగ్గలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరిష ఆదేశాలు మేరకు అత్యాధునిక వసతులు కలిగిన నూతన 108 వాహనంను ప్రారంభించారు వజ్జ బాబురావు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పేదవాడికి వైద్య, విద్య సేవలు అందించడంలో రాజీ పడదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, లోడగల కామేష్ యాదవ్, సప్ప నవీన్, గురుటి సూర్యనారాయణ, పైల చక్రధర రావుతో పాటు టిడిపి నాయకులు, 108 జి ఎం బాలరాజు, డీఎమ్ నవీన్, చిన్న బాబు, ఓయీ రంగా ప్రసాద్, సత్యంతో పాటు పలాస డివిజన్ 108 సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్ తరలింపును ఆపండి

- అన్నదాత పోరుపై పోలీసుల ఉక్కు పాదం - ఎక్కడికక్కడ నాయకులను హౌస్ అరెస్టులు
- ర్యాలీకి బయలుదేరిన పేరాడ తిలక్ను అడ్డుకున్న పోలీసులు - పోలీసుల వైఖరి పై నిరసన తెలిపిన రైతులు
- చంద్రబాబు,అచ్చెన్నాయుడు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు - ఆర్డిఓ కి వినతిపత్రం సమర్పించిన వైసీపీ ముఖ్య నాయకులు
- అచ్చెన్నాయుడు అసమర్థత వల్లే యూరియా కొరత : పేరాడ తిలక్

విశాలాంధ్ర - టెక్కలి : యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్న టీడీపీ, కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసీపీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైసీపీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలిలో జరిగిన అన్నదాత పోరు కార్యక్రమం పోలీసుల అడ్డగింతలు, నాయకుల గృహనిర్బంధాలు, నిరసనలు మధ్య హోరా హోరాగా జరిగింది. టెక్కలిలో అన్నదాత పోరు కార్యక్రమం రైతు ర్యాలీ నిర్వహించకుండా ఉండేందుకు టెక్కలి డిఎస్పి ఆధ్వర్యంలో పోలీసులు శతవిధాల ప్రయత్నించారు. తిలక్ వ్యూహాత్మకంగా వ్యవహరించి ముందుగానే టెక్కలి చేరుకొని నాయకులను, రైతులందరినీ టెక్కలి చేరుకోవాలని సూచించారు. ప్రైవేట్ కల్యాణ మండపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లేందుకు తిలక్ బయలుదేరగా అప్పటికే చుట్టుముట్టి ఉన్న పోలీసులు తిలక్ ను పార్టీ శ్రేణులను బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిని ప్రతిఘటించిన తిలక్ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా టెక్కలి డిఎస్పి ఆధ్వర్యంలోని పోలీసుల బృందం తిలక్ ను నిలువరించి నాయకులను, కార్యకర్తలను పోలీసు వాహనాల్లో ఎక్కించి నౌపడ,కోటబొమ్మాలి, సంతబొమ్మాలి, టెక్కలి పోలీస్ స్టేషన్ లకు తరలించారు. అప్పటికే వందలాది మంది రైతులు వైసీపీ శ్రేణులు చేరుకోవడంతో వీరిని అడ్డగించడం పోలీసులు వల్ల కాలేదు. చివరకు ఆర్డీవోకి వినతిపత్రం అందజేసినందుకు అనుమతించాలని తిలక్ కోరగా పోలీసులు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వకుండా తిలక్ ను పోలీస్ వాహనంలో తీసుకుని ఆర్డిఓ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న వందలాదిమంది నాయకులు రైతులు ర్యాలీలుగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు చంద్రబాబునాయుదు, అచ్చన్నాయుడుకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఆర్డీవోకి వినతి పత్రం అందజేసిన ముఖ్య నాయకులు...

యూరియా బ్లాక్ మార్కెట్ ను అరికట్టి రైతులకి యూరియా తక్షణమే అందజేయాలని కోరుతూ వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కుంభా రవిబాబు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి లు మంగళవారం టెక్కలి ఆర్డిఓకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎరువులు సకాలంలో రైతులకు అందజేయకపోవడంతో యూరియా బస్తా 600 నుంచి 700 వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతాంగానికి ఏర్పడిందని, యూరియాను టిడిపి నాయకులు బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. మార్క్ఫెడ్ పిఎసిఎస్ లకు అందజేయాల్సిన ఎరువులు ప్రైవేట్ వ్యాపారులకు ఇస్తూ దళారీల ద్వారా రైతుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. గతంలో ఎరువులను ఆర్బికేల ద్వారా సరఫరా చేయడంతో రైతులకు సకాలంలో ఎరువులు అందేవని, ప్రస్తుతం దళారీ వ్యవస్థతో చంద్రబాబు నాయుడు రైతాంగాన్ని నట్టేట ముంచారని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసమర్థత వల్లే రాష్ట్రంలోనూ, టెక్కలి నియోజకవర్గంలో యూరియా కొరత ఏర్పడిందని తక్షణం వ్యవసాయ శాఖ మంత్రివర్గం నుంచి తొలగించి రైతాంగానికి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి పార్టీ రద్దు చేసిన ఉచిత పంటల పథకాన్ని పునరుద్ధరించాలని పంట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాలి, కోటబొమ్మాలి మండలాలకు చెందిన నాలుగు మండలాల వైసీపీ సీనియర్ నాయకులు పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు పోరుకు పోలీసులు బ్రేక్..ఆగ్రహించిన వైకాపా శ్రేణులు

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట, కంచిలి మండలాల్లో పార్టీ అధిష్టానం పిలుపు మేరకు వైసీపీ నేతలు మంగళవారం చేపట్టిన రైతు పోరు కార్యక్రమానికి ఆయా మండలాల్లో పోలీసులు బ్రేక్ వేశారు. సోంపేట మండలంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, జెడ్పీటీసీ తడక యశోద, జోగారావుల ఆధ్వర్యంలో, అలాగే కంచిలి మండలంలో ఎంపీపీ పైల దేవదాసురెడ్డి, జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి కృష్ణారావుల ఆధ్వర్యంలో రైతన్నకు యూరియా మొదలైన ఎరువులు దక్కకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన తెలిపే కార్యక్రమం చేపట్టారు. అందుకు అనుగుణంగా ఆయా మండలాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు కలిసి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు చేసిన ప్రయత్నం పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం ఉదయం నుంచి వైసీపీ నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లు చేశారు. సోంపేట ఎంపీపీ డాక్టర్ దాసును ఆయన స్వగృహంలోనే హౌస్ అరెస్ట్ చేయగా జెడ్పీటీసీ తడక యశోదను పలాసపురంలో హౌస్ అరెస్ట్ చేశారు. కంచిలి ఎంపీపీ పైల దేవదాసురెడ్డి పోలీసులు తన స్వగ్రామం చేరుకునేసరికి పార్టీ కార్యాలయం వద్దకు కంచిలి రావడంతో పోలీసులు అక్కడే చుట్టిముట్టి పార్టీ నేతలను బయటకు వెళ్లనీయకుండా చేశారు. జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షిని కూడా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అన్ని చోట్ల అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాసురెడ్డి మీడియాతో మాట్లాడి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు మేలు చేయని ప్రభుత్వం దండగ

రాష్ట్రంలో రైతాంగానికి మేలు చేయని ప్రభుత్వం దండగ అని ఎంపీపీ పైల దేవదాసురెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. యూరియా, డీఏపీ వంటి ఎరువులు రైతులకు లభించకపోవడం ప్రభుత్వ చేతకాని తనానికి నిర్లక్ష్యమని అన్నారు. అధికార పార్టీ నేతలు వచ్చిన కొద్దిపాటి ఎరువులను బ్లాక్ చేస్తూ అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతులకు ఎరువులు సరఫరా చేయకపోతే వ్యవసాయం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని పూర్తిగా దెబ్బతీయాలన్న ఆలోచనతో ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నేతలు పాల్గొన్నారు.

తల్లి వైద్యానికి దాతల సహాయం కోసం కూతురు ఎదురు చూపు.. క్యాన్సర్‌తో బాధ పడుతున్నతల్లి

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు గ్రామం దేవర వీధికి చెందిన వైశ్యరాజు జయలక్ష్మి ప్రాణాంతక బ్లడ్ క్యాన్సర్‌తో గత కొన్నేళ్లుగా బాధపడుతుంది. ఆమె బ్రతక దానికి అత్యవసరంగా 5 లక్షలు రూలు అవసర మౌతుందని, ఆమె కుమార్తె స్వాతి దాతలను అభ్యర్థించారు విశాఖ పట్టణం మహాత్మగాంధీ కాన్సర్ వైద్యశాలలో ప్రస్తుతం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఆరోగ్యశ్రీ పరిమితి అయిపోవడం' వలన రోజుకు 20 వేలు వరకు ఖర్చవుతుందని, అంత డబ్బులు పెట్టే ఆర్థిక స్థోమత లేక మనసున్న దాతలు కోసం ఎదురుచూస్తుంది. ఇందుకోసం ఎవరైనా మానవత్వంతో మీకు తోచిన సహాయం అందించాలని, ఆమె కుమార్తె స్వాతి మంగళవారం అభ్యర్థించారు. శస్త్రచికిత్సకు రూ.10 లక్షలు వరకు అవసరమని, ఇది మా ఆర్థిక స్తోమతకు మించినది కావటంతో దాతలను అభ్యర్థిస్తున్నా మన్నారు. తల్లి ఆరోగ్యం బాగుపడటం కోసం సహాయానికి మరొక్కసారి చేతులు జోడించి అభ్యర్థిస్తున్నామని, మా తల్లికి కాపాడిగలిగేది మీరేనని భావోద్వేగంతో తెలుపుతూ, తమ తల్లికి సాయం అందించాలనుకునేవారు ఫోన్ పే నంబర్- 8500568410 సాయం అందించాలని ఆమె కోరారు.

క్రీడల పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం నగరంపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాలలో మంగళవారం నాడు కబడ్డీ, బాడ్మింటన్, యోగ ఎంపికలు జరిగాయి. మండలంలో గల 20 ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్ నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దీనిలో 68 మంది డివిజనల్ స్థాయి పోటీలకు మండల టీంగా అర్హత సాధించారు. ఈ నెల 15 నుండి 17 వరకూ పలాస మండలంలోని బొడ్డపాడు హైస్కూల్‌లో జరిగే పోటీలలో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం వజ్రపుకొత్తూరు మండల ఎంఈఓ బి.వెంకట రమణ, స్థానిక ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మి పతి, గ్రామ పెద్దలు ఎస్. చక్రవర్తి, ఎం.ఉపేంద్ర, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ అధ్యక్షులు వి.తవిటయ్య, రాష్ట్ర అథ్లెటిక్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కే.హరిబాబు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.గజేంద్ర రావు, వ్యాయమ ఉపాధ్యాయులు జే.నారాయణ, పద్మాలోచనం, రామారావు, మున్నా, శివ, రమ్య, వెంకటేశ్వరి, శ్రీను, కోటి, హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే విద్యా, ఉద్యోగాలలో 3శాతం క్రీడా రిజర్వేషన్ ద్వారా అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుప్త హత్యకు పాల్పడిన హంతకులు పట్టివేత

స్వాధీనం చేసుకున్న 1.33 కిలోల బంగారం ముక్కలు రెండు కార్లు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం

విశాలాంధ్ర - నరసన్నపేట : బంగారం కమిషన్ వ్యాపారం చేసుకుంటున్న పొట్నూరు వెంకట పార్వతీశం గుప్తా హత్య కేసును నరసన్నపేట పోలీసులు ఛేదించారు. ఈ విషయమై మంగళవారం స్థానిక సిఐ కార్యాలయంలో టెక్కలి డి.ఎస్.పి, డి.లక్ష్మణరావు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26వ తేదీన బంగారం కొనుగోలు కోసం విశాఖపట్నం బయలుదేరిన గుప్త, ఎప్పటిలాగే తన కారు డ్రైవర్, స్థానిక రాజీవ్ నగర్ కాలనీకి చెందిన జవ్వాది సంతోష్ కుమార్ ను తీసుకువెళ్లాడు. విశాఖపట్నంలో కొనుగోలు చేసిన బంగారంతో నరసన్నపేట వస్తున్న గుప్తను, శ్రీకాకుళం కు చెందిన ఆదిత్య కార్ వరల్డ్ కు చెందిన యజమాని, మోళ్ల వద్దకు తీసుకువెళ్లి, కార్ వరల్డ్ షాపులో హత్య చేశారు. అనంతరం వారు ఆ మృతదేహాన్ని పాత్రునివలస గ్రామ పరిధిలో ఉన్న రామిరెడ్డి సాగునీటి కాలువలో పడవేశారన్నారు. ఆ మృతదేహాన్ని పోలీసులు శవ పంచనామా చేసిన అనంతరం గుప్త హత్యకు కారు డ్రైవర్, సంతోష్, ఆదిత్య కార్ వరల్డ్ ఓనర్, అప్పలరాజు పాల్పడినట్లు గుర్తించడం జరిగిందని తెలియజేశారు. వీరి వద్ద నుండి సుమారు 1.34 కిలోల బంగారం ముక్కలను, బొలెరో, షిఫ్ట్ డిజైర్ కారు తో పాటు ఒక ఆండ్రాయిడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ, లక్ష్ లక్ష్మణరావు తెలిపారు. మృతుడు, గుప్త సోదరుడు, మన్మధరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాకచక్యంగా వ్యవహరించి, హంతకులను పట్టుకున్న నరసన్నపేట సీఐ, ఎం. శ్రీనివాసరావుకు, నరసన్న పేట ఎస్సై, సిహెచ్ దుర్గాప్రసాద్, పోలాకి ఎస్సై, రంజిత్ కుమార్, జలుమూరు ఎస్సై, అశోక్ బాబు, సారవకోట ఎస్సై, అనిల్ కుమార్ తోపాటు పిఎస్ఐ, వి.హేమంత్ కళ్యాణ్, హెచ్ సి, ఎస్, ప్రతాప్, పి సీలు, పి.దాలి నాయుడు, ఎం,వెంకటేష్ తదితరులను డి.ఎస్.పి, లక్ష్మణరావు అభినందించారు.

ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగబోయే కోటబొమ్మాలి శ్రీ కొత్తమ్మ తల్లి అమ్మవారి జాతర ఉత్సవాలు సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య మంగళవారం పరిశీలించారు. ముఖ్యంగా పారిశుధ్య కార్యక్రమాలు, ముందస్తు ప్రణాళిక ఏర్పాటులో భాగంగా కోటబొమ్మాళి గ్రామంలో పర్యటించి స్థానిక అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి వాత్సల్య రాధాకృష్ణతో, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించబోయే కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికులు ఎంతమంది అవసరం, క్యూలైన్లు వంటి అంశాలను చర్చించారు. ఉత్సవాల నేపథ్యంలో నిర్వహించబోయే వివిధ రకాల పోటీలు, జానపద, పౌరాణిక నాటక కార్యక్రమాలు కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఓతో పాటు టెక్కలి డి.ఎల్. పి.ఓ, ఐ.వి. రమణ డిప్యూటీ ఎంపీడీవో, కోటబొమ్మాళి ఈ.వో.పి.ఆర్.డి. ఆనందరావు, పంచాయతీ కార్య నిర్వహణ అధికారి చింతాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ గృహ నిర్బంధం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఎరువుల పంపిణీపై నిరసనకు వై.సి.పి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల ఎంపీపీ అన్నదాత పోరుబాట కార్యక్రమానికి హాజరవ్వకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రూరల్ పోలీసులు ఆమెను శాసనం గ్రామంలో ఆమె ఇంటి వద్ద రూరల్ పోలీసులు నిర్బంధించారు. అన్నదాత పోరు బాట కార్యక్రమానికి తరలివెళ్తున్న వై.సి.పి కార్యకర్తలను అడ్డుకోవడంపై ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్ బచ్చు జగన్‌తో పాటు పలువురు పోలీసులను ప్రశ్నించారు.

యూరియా వాడకంపై అవగాహన

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : మంగళవారం సరుబుజ్జిలి మండలంలోని సింధువాడ సచివాలయన్ని డి.ఆర్.డి.ఏ. పి.డి. కిరణ్ కుమార్ సందర్శించారు. సచివాలయం సిబ్బందికి యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతులకు పూర్తి స్థాయిలో యూరియా వాడకం పై అవగాహన కల్పించాలని, మోతాదుకు మించి ఉపయోగించటం వలన కలిగే దుష్ప్రభావాలను రైతులుకు తెలియపరిచాలని, అనవసరపు కొరతను అరికట్టాలని, త్వరలోని పూర్తి స్థాయిలో సరిపడా యూరియా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ.పి.ఆర్.డి. బి. రామా రావు. వెలుగు ఏ.పి.ఎమ్. సి.హెచ్. గోవింద రాజులు, సిబ్బంది పాల్గున్నారు.

గర్భిణీలకు ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్

విశాలాంధ్ర - పోలాకి : గర్భిణీ స్త్రీలకు ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ పై పోలాకి విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ అవగాహన కల్పించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోలాకి పరిధిలో గంటపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ఎంసిపి కార్డు యొక్క ప్రాధాన్యత గురించిన అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ సమీకృత ఆహారం తీసుకోవడంతో పాటు కచ్చితంగా తనిఖీలను నిర్వహించుకోవడం అల్ట్రా సౌండ్ స్కాన్ టిఫ్ఫా స్కాన్ ఆవశ్యకతను గర్భిణీలకు ఉచితంగా లభించే జననీ సురక్ష యోజన జనని శిశు సురక్ష కార్యక్రమం ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి పారి తోషికాలను క్లుప్తంగా వివరించారు. ప్రతి నెల 9వ తారీఖున ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమము ద్వారా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక పరీక్షలు మరియు చికిత్స ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ బాబు లక్ష్మీ ఎఎన్ఎమ్‌లు ట్రైని జిఎన్ఎంలు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తగుమోతాదులో యూరియా వాడాలి

విశాలాంధ్ర - కవిటి : రైతులు యూరియాను తగుమోతాదులో వాడాలని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జి.జయదేవి అన్నారు. ఈ మేరకు మంగళవారం కొజ్జిరియా పంచాయితీ పరిధిలోని రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతుకు మొదటి విడతలో 25 కేజీల యూరియా అలాగే రెండవ విడత మరో 25 కేజీ యూరియా అందించడం జరిగిందని రైతులకు వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏడీఏ భవానీ శంకర్,తహసీల్దార్ బెహరా. మురళీమోహనరావు, ఎంపీడీవో త్రినాథ్, ఏవో పి శ్రీదేవి,రైతులు పాల్గొన్నారు.

13న జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

ఆమదాలవలస పెన్షనర్ల సంఘం

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టణ సబ్ ట్రెజరీ కార్యాలయం ఆవరణలో సురవరపు సిమ్మి నాయుదు అధ్యక్షతన జరిగిన, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఆమదాల వలస శాఖ కార్య వర్గ సమావేశాన్ని ఉద్దేశించి సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డే పల్లి జనార్ధన రావు మాట్లాడుతూ 13 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు, విజయవాడలో జరుగు పెన్షనర్ల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు "పెన్షన్ వ్యవస్థ" పై చేస్తున్న దాడుల గూర్చి ఈ సమావేశంలో చర్చించి, దశల వారి పోరా ట కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. గౌర వాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాలిడేషన్ బిల్లు 2025 ను తీసుకువచ్చి, పెన్షనర్ల హక్కులను హరించాలని చూస్తుందని, దీనిపై దేశ వ్యాప్తంగా పెన్షనర్లంతా ఏకమై, కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కోశాధికారి హెచ్ వి సత్యనారా యణ మాట్లాడుతూ, 12వ పి.ఆర్.సి,ని వెంటనే నియమించి, ఐ.ఆర్,30 శాతం ఇవ్వాలని, 11వ పి.ఆర్సి, బకాయిలు వెంటనే చెల్లించాలని, దహన ఖర్చులను ఎప్పటికప్పుడు చెల్లించాలని అన్నారు. ఈ ఎస్ పి పెన్షనర్లకు కనీస పెన్షన్, 9 వేల రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, బి.సూర్యనారాయణ, పి.భానుజీరావు, కే.సంజీవరావు, బి.నారాయణరావు, కే.జనార్ధనరావు, కె. కోటేశ్వరరావు, ఎన్.వాసుదేవరావు, పి.ధనుంజయ రావు, పి.వెంకటేశ్వరరావు, బి.వెంకటరమణ, బి. వి.ఎస్.ఎన్. మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం కల్పించి ఆదుకోవాలి

రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్రంలో ఉన్న రజకులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము ప్రభుత్వాన్ని కోరారు మంగళవారం ఉమ్మడి విశాఖపట్నం రజక సేవా సంఘం అధ్యక్షులు రూంకాన నూకరాజు , శ్రీకాకుళం రజక సంఘం అధ్యక్షులు నౌపడ రామారావు ఉమ్మడి విశాఖ రజక సంఘం నాయకులు అంతా కలిసి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకులకు ఎటువంటి రక్షణ చట్ట లేకపోవడం వలన తరచూ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట రజకులపై దాడులు దౌర్జన్యాలు గ్రామ బహిష్కరణలు జరుగుతున్నాయని కావున ప్రభుత్వం రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పించి ఆదుకోవాలని కోరారు రజకులు పై హత్య, దాడి చేయడం హేయమైన చర్యని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు హత్యకు గురైన రజక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు అనంతరం రజక సంఘం నాయకులంతా ఆ కుటుంబానికి కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు ఈ పరామర్శలో ఉమ్మడి విశాఖ రజక సంఘం జిల్లా నాయకులు నల్లగొండ సూర్యనారాయణ గాంధ్రెడ్డి వెంకటరమణ పసుపులేటి గోవింద్ గొలగాని సౌజన్య చీపురుపల్లి బాబ్జి నేమర్తి కొండబాబు నరవ చంటి పొలిపల్లి సురేష్ సుదికొండ అప్పారావు అరసవల్లి సూర్యనారాయణ అప్పారావు తదితరులు ఉన్నారు.

పక్కాగా విలేజ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి

ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

విశాలాంధ్ర - కొత్తూరు : ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి అవసరమయ్యే పనులను గుర్తించి విలేజ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. సోమవారం ఆయన కొత్తూరు మండలం అడ్డంగి పంచాయతీలోని దిగువ మల్లెలుగూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధులు తిరిగి గ్రామ సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యలను విలేజ్ యాక్షన్ ప్లాన్ లో పొందువరచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై గ్రామానికి అవసరమయ్యే వనరులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆది కర్మయోగి జిల్లా మాస్టర్ ట్రైనీ, ఐటిడిఏ ఏఎంవో కోటిబాబు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు టెండర్లు ఖరారు

విశాలాంధ్ర - కవిటి : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం,సుర్ల రోడ్డు సేషన్ల మధ్య రైల్వే రోడ్డు అండర్ బ్రిడ్జి ఉత్తరవైపు 626-02 వద్ద రూ. 2.60 కోట్లు, మరియు ఇచ్ఛాపురం, జాడుపూడి రైల్వేస్టేషన్ల మధ్య 627-36-38 మధ్య దక్షిణ వైపు రూ. 3.19 కోట్లతో రెండు బ్రిడ్జిలకు టెండర్లు ఖరారైనట్లు రైల్వే జడ్ఆర్డీయుసీసీ మెంబరు శ్రీనివాస్ రౌళ్లో తెలిపారు. విశాఖపట్టణం కు చెందిన వి.శ్రీనివాస్ గారు కాంట్రాక్టర్ టెండర్లు దక్కించుకున్నట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి గడువులోన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్కు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు హౌస్ అరెస్ట్ ...పలాసలో ఉద్రిక్తత

విశాలాంధ్ర - పలాస : ఆలుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతాంగానికి అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్న సంగతి విధితమే. ఈ నేపథ్యంలో వైకాపా పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహనరెడ్డి రైతాంగానికి బాసటగా నిలిచేందుకు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పలాసలో నిర్వహించనున్న రైతుపోరు బాటలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును హౌస్ అరెస్ట్ చేయడంతో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైకాపా నాయకులతో కలిసి పలాస ఆర్డీఓ కు వినతిపత్రం అందజేసేందుకు మాజీ మంత్రి సిద్ధం కాగా కేవలం 15 మందికి మాత్రమే అనుమతిస్తామని కాశీబుగ్గ డిఎస్ పి వి.వెంకట అప్పారావు స్పష్టం చేశారు. దీనికి నిరాకరించిన మాజీ మంత్రి అప్పలరాజు తన స్వగహం వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం అనుచరులతో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధం కాగా పోలీసులు మాజీ మంత్రితో పాటు కొంత మంది అనుచరులను పోలీస్ వాహనంలో ఎక్కించుకొని పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద విడిచి పెట్టారు. అక్కడికి మాజీ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే కుంబపాటి రవికుమార్, ఎంఎల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయసాయిరాజ్ తో పాటు పలువురు నాయకులు అక్కడికి చేరుకొని ఇంచార్జ్ ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ధర్మాన క్రిష్ణదాస్, డా.సీధిరి అప్పలరాజు, ఎంఎల్సి నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయసాయిరాజ్ లు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు అందించపోవడంతో, రైతాంగం ఎరువులు కోసం రోడ్లపైన ధర్నా చేస్తుండగా వారికి మద్దతుగా వైసిపి ప్రభుత్వం రైతు పోరుబాట చేస్తుంటే అరెస్ట్ లు చేస్తారా..? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఏ నాడు రైతులు వారి అవసరాలు కోసం రోడ్లు ఎక్కిన సందర్భాలు చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఈ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తుందని ఆరోపించారు. శివారు ప్రాంతాలకు వంశదార నీరు అందించలేదని వరుణుడు కరుణించడంతో కొంత అలస్యంగా సాగు నీరు అందిందన్నారు. తరువాత ఎరువులు కోసం రైతులు కార్యాలయాల వద్ద బారులు తీరే పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయంలో పదివేలకు పైబడి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వారి పంచాయితీలలోనే రైతులకు కావాల్సినవి అన్ని సమకూర్చడం జరిగిందని గుర్తు చేశారు. రైతుల అవసరాలు తీర్చేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించామని, వారి వద్ద రైతులు సమాచారం పూర్తిగా ఉందని ఆ సమాచారం మేరకు రైతులకు ఎందుకు ఎరువులు అందించలేకపోయారని ప్రశ్నించారు. అనుభవం ఉండి నాలుగు సార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు అధికారులను వినియోగించుకొని రైతులకు సకాలంలో ఎరువులు అందించలేని చేతకాని ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందా రన్నారు. ఎక్కడ అణచివేతకు గురవుతుందో అక్కడ తిరుగుబాటు వస్తుందని నేడు కూటమి పాలనపై అన్నదాతల తిరుగుబాటు ప్రారంభమైందని కూటమి ప్రభుత్వం పతనానికి రైతాంగం శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలో గోనెపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు దామోదర రావు సమక్షంలో విద్య కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ మంగళవారం సన్మానించారు. గోనేపాడు పాఠశాల పూర్వ విద్యార్థుల బృందం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర, పంచమి బహుమతులు వరుసగా రూ. 4000, రూ. 3500, రూ.3000, రూ.3000, రూ.2000 ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గోనుపాడు పాఠశాలలో చదవటం గొప్పతనంగా చెప్పు కుంటున్నామని, అధ్యాపక బృందం ఎప్పటికప్పుడు పలు సలహాలు తెలిపుతూ విద్యా ర్థులకు ఉత్తే జాన్ని అందించారాని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్కే కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే సంబరాలు

- విద్యార్థులు క్రమశిక్షణతో తమ లక్ష్యాన్ని సాధించుకోవాలి
- రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులు ఆర్ జనార్ధన్ రావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక ఎస్వీఆర్కె కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు చింతాడ పారతీశాం, విశ్వ జ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీనకాన జోగారావు, ఎస్వీఆర్కే కళాశాల డైరెక్టర్ అన్నెపు. ఉమామహేశ్వర రావు, రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల అవార్డు గ్రహీత ఆర్ జనార్ధన రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతు అభినందనలు తెలిపారు. విద్యార్థులు కళాశాలలో క్రమశిక్షణగా నడుచుకుంటూ విద్యను నేర్చుకుంటే భవిష్యత్తు తరాలలో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తమ లక్ష్యాలు పై దృష్టి పెట్టి చదువుకొని మంచి మార్కులతో కళాశాలకు పేరు తేవాలని, ఉన్నత స్థాయికి చేరుకొని లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. అనంతరం ఇటీవల ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ముఖ్యమంత్రి చేతుల మీదగా అవార్డును తీసుకున్న గ్రహీత ఆర్ జనార్దన్ రావుకు ఎస్వీఆర్కే కళాశాల సిబ్బంది విద్యార్థులు కలిసి ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రావు, మెట్ట రమేష్, జోగారావు, శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పేట విద్యాశాఖపై విచారణ

- విద్యాశాఖపై వచ్చిన కథనాలపై విచారణకు ఆదేశించిన జిల్లా అధికారులు - సమాచార హక్కు చట్టానికి సమాధానం ఇవ్వని మండల విద్యాశాఖ

విశాలాంధ్ర
విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : గత కొన్ని రోజులుగా లక్ష్మీనర్సుపేట మండల విద్యాశాఖ అధికారులపై వరుసగా వస్తున్న ఆరోపణలపై ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ స్పందించి విచారణకు ఆదేశించడం శుభ పరిణామం మంగళవారం విచారణ అధికారిగా టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి వి.విలియమ్స్ లక్ష్మీ నర్సుపేట మండల విద్యాశాఖ కార్యాలయానికి రావడం జరిగింది ఉప విద్యాశాఖ అధికారి విచారణలో విచారణ అధికారి అడిగిన ప్రశ్నలకు ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులు నీళ్లు నమలడం విచారణలో ఉప విద్యాశాఖ అధికారి ముందు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయినట్లు ఎంఈఓ లవైఖరిపై వి.విలియమ్స్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎంఈఓల నిర్లక్ష్యం సమన్వయ లేమి ఒంటెద్దు పోకడలు నియంత్రుత్వ వైఖరి స్పష్టంగా కనిపించినట్లు సమాచారం. అయితే ఎంఈఓల ఒంటెద్దు పోకడలు, నియంత్రుత్వ వైఖరి, నిర్లక్ష్య పూరిత విధానాలను ఎండగడుతూ వివిధ అంశాలపై వార్తా కథనాలు ప్రచురించిన మండల విలేకరులను కూడా విచారణ కోసం పిలవడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం పత్రికల్లో వచ్చిన వివిధ కథనాలపై మండల విలేకరులతో ఉపవిద్యా శాఖ అధికారి పలు ప్రశ్నలు వేస్తూ సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిపై రాసిన కథనాలకు సంబంధించిన ఆధారాలు అడిగినట్లు వాటన్నింటినీ నమోదు చేసుకున్నట్లు ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం అధికారులు ఇవ్వకపోవడం ఎంఈఓ విద్యార్థుల మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండడం, నిధులు దుర్వినియోగము, ముఖ్య పండుగలు మండల విద్యాశాఖ కార్యాలయంలో జరపకపోవడం, నిధులు దుర్వినియోగం, భోగస్ రోల్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించినట్లు, వార్త కథనాలు వచ్చిన తర్వాత మండల విద్యా శాఖాధికారులు లెక్కలేనట్లు వ్యవహరించడం విచారణలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. విచారణ అధికారిపై విలియమ్స్ నివేదిక జిల్లా అధికారులకు సమర్పించాక అహంకారపూరిత అధికారి భవితవ్యం తేలనుందని ఆరోపణలు వచ్చిన సదర అధికారుల్ని తాత్కాలికంగా విధుల నుండి పక్కనపెట్టి విచారణ చేస్తే ఇంకా విచారణ బాగా జరిగేదని మండలంలో ఉపాధ్యాయులు అనుకుంటున్నారు.

రైతు కోసం పోరాడితే అరెస్టులా..?

విశాలాంధ్ర - కవిటి : కూటమి ప్రభుత్వం ఎరువులు బ్లాక్ మార్కెటింగ్,కృత్రిమ కొరత, అధిక ధరలతో రైతులను దగా చేస్తుంది. దీనిపై వైకాపా ఆధ్వర్యంలో అన్నదాత పోరు. పేరుతో చేస్తున్న శాంతీయుత పోరాటాన్ని అడ్డుకొని వైకాపా నాయకులను అరెస్టులు చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్లో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం కూనీ చేస్తుందని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు ఆరోపించారు. వైకాపా చేసిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు బల్లిపుట్టుగలో జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయకు స్థానిక వైకాపా నాయకులకు, కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావుకు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అలాగే వైకాపా మండల కన్వీనర్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,మండల నాయకులకు అరెస్ట్ చేశారు.

ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపద్దు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపొద్దని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు బల్లెడ రవి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెం డింగ్ డీఏలను విడుదల చేయాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షా విధానాన్ని సమీక్షించాలని, అసైన్మెంటు పుస్తకాల నిర్వహణతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తలకు మించిన భారం అవుత ఉందన్నారు. ఈ కారణంగా బోధన కుంటుపడుతున్నట్టు చెప్పారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు, నవీన్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

జె.సి.ఐ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : స్థానిక జె.సి.ఐ శాఖ ఆధ్వర్యంలో జె.సి.ఐ వీక్ 2025 ప్రారంభోత్సవాన్ని మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. జె.సి.ఐ అధ్యక్షులు కాళ్ళ జయదేవ్, జె.సి.ఐ వీక్ చైర్మన్ డాక్టర్ వెచ్చా వాసవి, సెక్రటరీ డా॥ టి. మోహన్ వెంకటేశ్ నాయకత్వంల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జె.సి. ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.సి.ఐ అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 9 నుండి 15 వరకు వివిధ సామాజిక ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోన్ అధికారులు షణ్ముఖ్, స్వరూప్, వెచ్చా రాము, శ్రీనివాస్ మట్ట, స్నిగ్ధ, శ్రావ్య, అనిత్, గౌరిజీ, ఆర్. శ్రీనివాస్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఏపీ ఈఏపీ సెట్ను బైపీసీ స్ట్రీమ్లో రాసిన అభ్యర్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ను సాం కేతిక విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రి న్సిపాల్, సహాయ కేంద్రం కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్) లతో పాటు బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ కౌన్సెలింగ్ జరుగు తుందన్నారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ చేస కోవాలన్నారు. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఆన్లైన్లో సర్టిఫికేట్ల అప్లోడ్, పరిశీలన జరుగుతుందని చెప్పారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు కళాశాలలు, కోర్సుల ఎంపికకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 19న వెబ్ ఆప్షన్లలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 21న సీట్ల కేటాయింపు వివరాలు ప్రకటిస్తారన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ కావాలన్నారు.

భక్తి భావాలతో మెలగండి

మైసూరు దత్త పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామి

విశాలాంధ్ర - నందిగాం : ప్రతి ఒక్కరు భక్తి భావాలుతో మెలగాలని మైసూరు దత్త పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామి అన్నారు. మండలం పెద్ద తామరాపల్లిలో రత్త భక్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాభావాలను అలవర్చు కోవాలని సత్సంగ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. అహం, అహంభావం విడనాడాలని మనస్సులో దైవాన్ని ప్రార్థంచుకోవాలన్నారు. భజనలు చేసే సమయంలో తాళం లయ తప్పకుండా ఎలా చేస్తామో అదే విధంగా దైవాన్ని నిరంతరం మనస్సులో తలంచుకోవాలన్నారు. భగవంతుడు భక్తులకే బాధలు పెడతాడని భక్తులు అటుపోటులను ఎదుర్కోవాలని సూచించారు. అంతకు ముందు మహిళలచే అనఘావ్రతం చేపించారు. ఈ కార్యక్రమంలో తమిరె మధుసూదనరావు, దేవేంద్రరావు, చిన్నికృష్ణ అనందరావు తదితరులు పాల్గొన్నారు. కాపుతెంబూరులో మండలం కాపుతెంబూరు దత్తాశ్రమంలో భక్తులనుద్దేశించి విజయానంద తీర్థస్వామి మాట్లాడారు. సనాతన సంప్రదాయాలను మరువరాదని హిత బోధ చేశారు. అంతకు ముందు అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు ఈ కార్యక్రమంలో నిర్విషియానందస్వామి, కిల్లి దీనబండు, అసపన్న జనార్థన, కార్చి బాబూరావు, పోలాకి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు

సాఫ్ట్వేర్ సంస్థ సీఈఓ చింత తులసీరావు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక ఐతమ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ భాగస్వామ్య విభాగాలకు చెందిన విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్ వేర్ బ్రెట్ కాన్ ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ కు చెందిన యంత్ర్, సీఈఓ చింత తులసీరావు, సెమినార్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారి అనుభవాలు ముచ్చటిస్తూ, ప్రస్తుత సాంకేతిక యుగంలో సాఫ్ట్వేర్ అభివృద్ధికు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఎంతో అవసరమన్నారు. అందుకు తగ్గ కోర్స్ లలో శిక్షణలు తీసుకోని, కొత్త ప్రాజెక్ట్ లు రూపొందించాలని ఆయన అన్నారు. ఐతం కళాశాలకు అన్ని ఆధునిక, సదుపాయాలు కల్గిన ల్యాబ్ లు ఉన్నాయని, తగ్గన నిష్ణతులైన అధ్యాపకులు ఉన్నారని ఆయన సంతృప్తి చెందారు. ఈ కళాశాల విద్యార్థులలో సాఫ్ట్వేర్ పట్ల నైపుణ్యత కలిగిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, అందుకు తప్పనిసరిగా మావంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల డైరెక్టర్ వివి నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు మరియు కళాశాల అభివృద్ధికు మా వంతు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామని, విద్యార్థులు ఇటువంటి అవకాశాలు వినియోగించుకొని, మంచి మంచి రంగాలలో స్థిరపడాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, ఐటి.హెచ్ఒడి డాక్టర్ బాలక రమేష్ నాయుడు, సిఎస్సి. హెచ్ఒడి డాక్టర్ వై రమేష్ లు, సిఈఓ తులసీరావు కు దుశ్శాలువ తో సత్కరించారు.

డీజేలను నిరోధించాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఇటీవల గణేష్ ఉత్సవాల సమయంలో విచ్చల విడిగా డిజెలను ఉపయో గించారని, చాలా చోట్ల వాటి వినియో గంతో ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొం టున్న సందర్భాలు సామాజిక మాధ్య మాల ద్వారా తెలు స్తున్నా ఎవ్వరు పట్టించుకోవట్లేదని శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ విచారాన్ని వ్యక్తం చేసింది. మంగళవారం ఈదుపురం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఊరేగింపులు, దేవుళ్ళ మండపాల వద్ద డిజె సౌండ్ లను అరికట్టాలని తీర్మానిస్తూ అధికారులకు విజ్ఞప్తి చేసారు. సాంప్రదాయ పద్ధతులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకోవడం శ్రేయస్కరమని అన్నారు. ప్రభుత్వాలు పోలీసులు కూడా డీజేలను విస్మరిస్తుండటం బాధాకరమని డీజే లను ప్రజలు బహిష్క రించాలని, అధికారులు డిజెల పట్ల కఠిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, అధ్యక్షులు రంగాల జానకిరామ్, ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, కోశాధికారి కొప్పల హేమంత్, సలహాదారులు బోర రామారావు, గుజ్జు కూర్మారావ్, ఆచారి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల అకాస్మిక తనిఖీలు

- ప్రీస్కూల్ నిర్వాహణలో లోపాలు ఉంటే మెమోలు తప్పనిసరి
- జిల్లా శిశు సంక్షేమ అధికారి విమల

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలోని స్థానిక ఆది ఆంధ్ర వీధి, వీర రామకృష్ణాపురం అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి సాధికారత అధికారి విమల ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కేంద్రాలలో ఉన్న పరిసరాలను, చిన్నారుల రికార్డులు, స్టాక్ రికార్డులు వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రీ స్కూల్ నిర్వహణ, పిల్లల క్రమశిక్షణ పరిశీలన చేసి అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు ఇటీవల అందజేసిన విద్యుత్తు గ్యాస్ స్టవ్ లను తనిఖీలు చేశారు. చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం తయారు చేయాలని, రుచికరమైన ఆహారాన్ని అందజేయాలని కార్యకర్తలకు తెలిపారు. అనంతరం చిన్నారుల కోసం వండిన పదార్థాలను రుచిని పరిశీలన చేశారు. ఈ తనిఖీలలో భాగంగా వీర రామకృష్ణాపురం మినీ అంగన్వాడీ కార్యకర్త విధులు శ్రద్ధగా నిర్వహించటం లేదని, ప్రీస్కూల్ నిర్వహణ లోపాలు ఉన్నట్లుగా గమనించి మెమో జారీ చేయవలసిందిగా సిడిపివో విద్య ని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఆమెతోపాటు నోడల్ అధికారి మణెమ్మ, సిడిపిఓ విద్య, సూపర్వైజర్లు సంధ్య, ఈశ్వరమ్మ, సరస్వతి తదితరులు ఉన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం

విశాలాంధ్ర - ఆమదాలవలస : శ్రీ సత్యసాయి సేవా సమితి మెట్టక్కి వలస ఆధ్వర్యంలో అర్బన్ ఆసుపత్రిలు మెట్టక్కివలస, మోనంగి వారి వీధి యూ హెచ్ సి లలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని కన్వీనర్ కన్నే పల్లి వెంకట కామావధానులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోనంగి వీధి ఆసుపత్రిలో గర్భిణీలకు మరియు వారి సహాయకులుగా వచ్చిన వారికి 44మందికి మరియు మెట్టక్కి వలస అర్బన్ ఆసుపత్రిలో 52 మందికి భోజన సదుపాయ కార్యక్రమాన్ని అందించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా ఇన్చార్జి డాక్టర్ తాతయ్యలు, సమితి విద్యా కోఆర్డినేటర్ ఆకెళ్ళ రామలక్ష్మి, మహిళా సేవాదలకు సమన్వయకర్త సంపదరావు శ్రీదేవి, మహిళా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ నిష్టాల సుబ్బలక్ష్మి, ఆకెళ్ళ శేషగిరి శాస్త్రి, సేవా దళ్ సమన్వయకర్త ఎస్ జి రమణ ఇవండ సూర్యప్రభ, దుం పల అన్నపూర్ణ సేవాదల్గా పాల్గొన్నారని యూత్ కోఆర్డినేటర్ బలివాడ దామోదర్ పట్నాయక్ తెలియజేశారు.

అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయండి

విశాలాంధ్ర - నందిగాం : గ్రామ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ సూచించారు. మండలం హర్షబాడ పంచాయతీ సవలలింగుపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'ఆదికర్మయోగి' గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుంది. అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంకటాపురం, వడ్డీనివలసలో 'పొలం పిలుస్తుంది'

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం అలుదు పంచాయతీ వడ్డీని వలస వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్ వెంకట్రావు పాల్గొని ప్రస్తుత వ్యవసాయ సీజన్లో రైతులు వినియోగించవలసిన ఎరువులను ఆయన వివరించారు వివిధ వంట పొలాలను పరిశీలించారు. ఆయనతో పాటు స్థానిక సిబ్బంది రైతులు విడివిరిగా పాల్గొన్నారు.

హారమ్మ మృతి కేసులో ఆరుగురు అరెస్ట్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఇటీవల గణేష్ నిమజ్జన కార్యక్రమం లో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అరసవల్లి హరమ్మ మృతి చెందారు. ఆమె మృతికి కారకులైన మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన ధవళ లక్ష్మారావు కుటుంబ సభ్యులు ఐదుగురును పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. అలాగే ఒక మైనర్ బాలికను జునైల్ కోర్టుకు హాజరు పరుచునున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. నిమజ్జనంలో ధవల లక్ష్మణరావు కుటుంబానికి చెందిన కొంతమంది దాడికి పాల్పడ్డారని ఆ దాడిలో హరమ్మకు మెడ పై బలమైన గాయంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఇరు వర్గాలకి గాయాలు కావడంతో రిమ్స్ ఆసుపత్రికి తరలించి అందించారు. నాలుగో తేదీ మధ్యాహ్నం ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు అని సీఐ వివరించారు. బాధిత వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు ఆయనతోపాటు ఎస్ఐ సలువులు బాలరాజు ఉన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

వైకాపా నియోజకవర్గ ఇన్చార్జి చింతాడ రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్ అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఎరు వుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమం ప్రారంభం కాకముందే చింతాడ రవికు మార్ ను గృహనిర్బంధం చేసి నిరసన కార్యక్రమానికి వెళ్ల కుండా అడ్డుకున్నారు. వైకాపా కార్యాలయం వద్ద కూడా పోలీ సులు ఎక్కువ సంఖ్యలో చేరుకొని కార్యకర్తలను, నాయకులను నిరసన కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకు న్నారు. ఎక్కడికక్కడ వైసీపీ నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడంతో పోలీసుల వలయాల్ని ఛేధించుకొని భారీగా రోడ్లెక్కిన పార్టీ శ్రేణులు, రైతులు ఆమదాలవలస తహసీల్దార్ కు ఎరువుల కొరతపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో శాంతియుతంగా చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎరువు ల కొరత వలన నేడు రైతుల అష్ట కష్టాలు పడుతున్నారని, ఈ సమస్యను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రతిపక్షంగా నిర సన తెలిపితే దానిని పోలీసులతో అడ్డుకున్నారని విమర్శిం చారు. రైతు సంక్షేమానికి ఆనాడు వైకాపా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే ఎరువులు అందించిన ఘనత జగన్మో హన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎరువుల కొరత లేకుండా సకాలంలో ఎరువులు అందజేసి రైతులను అభివృద్ధి వైపు నడిపించారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో ఎరువుల కొరత వలన పంటలు నష్టపోయే స్థితికి రైతులు వచ్చారని తెలిపారు. రైతులను నష్టాలు పాలు చేస్తున్న ప్రభు త్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయ న్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, నాలుగు మండలాల పార్టీ నాయకులు బెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవింద రావు, పొందూరు పట్టణ మాజీ కౌన్సిలర్లు పార్టీ వివిధ క్యాడర్ల నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకున్న వారిలో ఉన్నారు.